ఇది నిజమేనా ....!

రాజా నరేంద్రదేవ్ సంతతిలోని వారైన నాన్న ఇంత నికృష్టుడైన మనిషా....!

కేవలం కొన్ని దురలవాట్లకే బానిసనుకున్న నాన్న గారికి ఈ అలవాటు కూడా వుందా!

దిక్కు మాలినదాన్ని ఈ లోగిలిలో ఆశ్రయమిచ్చిన నాన్నాగారు అన్నపూర్ణమ్మతో నడుపుతున్న కథ ఇదా...

ఛీ ఛీ ...ఒక సామాన్యస్త్రీ... ఎంత దూరపు బంధువైతే మాత్రం ఒకనాడు అమ్మ పవళించిన పరుపై....

ఎంత సిగ్గుమాలిన ఆడది అన్నపూర్ణమ్మ....

ఎంతటి నీతి బాహ్యులు నాన్న.....

తను పెరిగింది ఈ లోగిలిలోనా... నైతిక విలువలు తెలియని ఈ మనుషుల మధ్యనా

మగవాళ్ళింతటి చపల చిత్తులా?

స్త్రీ సంపర్కానికింతటి ప్రాముఖ్యతనిస్తుంటారా?

హఠాత్తుగా ఆమెకు జయశ్రీ గుర్తుకొచ్చింది.

కిరీటి పొందుకోసం ఆమె ఎంతలా వెర్రెత్తిపోయెది జ్ఞప్తికొచ్చింది.

ఒకవేళ తను లేకపోతే కిరీటి కూడా...

ఆ ఆలోచన ఆమెను ఆపాదపస్తకం ఒణికిపోయేట్టు చేసింది.

లేదు...వీల్లేదు....

కిరీటి మరెవరి సొత్తు కాకూడదు.

అతడి మనసు మరెవరికి అంకితం కారాదు.

కేవలం తను మాత్రమే అతనికి అన్నీకావాలి.

ఆందోళనతోనే ఆమె నిద్రపోయింది.

సూర్యోదయం కాకముందే నిద్రలేచిన శిల్పకు లోగిలి ఓపాపాల పుట్టలా అనిపించింది.

మౌనంగా ముస్తాబై తను వైజాగ్ వెళ్ళిపోతున్నానని చెప్పగానే రంగనాథంగారు ముందు కాస్త ఆశ్చర్యపోయారు.

చీదరించుకుంటున్నట్టుగా ఆమె చూసే చూపులకు కారణం తెలుసుకోలేక కొంతసేపు నిశ్శబ్దంగా వుండిపోయారు.

ఓల్డ్ మోరిస్ మైనర్ కారులో కూర్చొని 'వెళ్ళి వస్తాను నాన్నా' అని కూడా చెప్పకుండా వెళ్ళిపోతున్న కూతురు నిర్లక్ష్యానికి కాస్త బాధ పడ్డారు కూడా.

11

మాలినీ నిలయం పోర్టికోలో కారు దిగిన శిల్ప అదురుతున్న గుండెలతో లోపలికి అడుగుపెట్టింది.

కిరీటి గదిలోంచి బయటికి వస్తున్న డాక్టరును చూడగానే భయపడినట్టై నిలబడి పోయింది

కొంత సేపటివరకు.

కిరీటికేమైంది....?

సిగ్గుతో ఆమె కను రెప్పలు వాలిపోయాయి. ఆ యింటి యజమానురాలై వుండి కూడా తనకేమీ తెలియనందుకు.

'అవును ....ఇది స్వయంకృతాపరాధం'

ఆత్రాన్ని అణచి పెట్టుకుంటూ కిరీటి గదిలోకి అడుగు పెట్టింది.

కిరీటి నీరసంగా కాట్‌పై పడుకుని ఊన్నాడు.

నిస్త్రాణంగా ఉన్న కిరీటి చూపులు శిల్ప రాకతో జీవాన్ని నింపుకున్నట్టుగా విశాలమయ్యాయి.

పది లంఖణాలు చేసినట్టుగా బడలికగా కనిపించిన కిరీటిని పలకరించటానికి ఆమెకు ధైర్యం చాలలేదు.

లజ్జితురాలై తల వంచుకుని అతనికి చేరువలో ఓ కుర్చీలో కూర్చుంది.

నిండు పున్నమిలా నవ్వులు వెదజల్లే కిరీటిని అలా చూడాల్సి వస్తుందని ఆమె వూహించలేక పోవటంతో దు:ఖం ముంచుకొచ్చింది.

ఏమైంది కిరీటికి.... ఎన్నాళ్ళ నుండి అనారోగ్యం, కనీసం తనకు ఫోన్ కూడా చేయలేదెందుకని?

చెప్పకుండా వెళ్ళినందుకు కోపమా! ఎందుకు చెప్పాలన్న నిర్లక్ష్యమా ?

ఒకవేళ కోపమే వుంటే తననింకా నిలదీయడేం.... తప్పు తనదే కాబట్టి తలవంచుకుని వుండేదిగా...

ఇలాంటి పరిస్థితుల్లో చేరువలో వుండాల్సిన తను దూరంగా వెళ్ళి పోయేసరికి నలుగురితోపాటు నౌకర్లు ఎంత చులకనగా అంచనా వేసివుంటారు.

"వస్తున్నానని ఫోన్ చేస్తే కారు పంపేవాడ్నిగా" అతనిలోని సౌమ్యత ఆమెను మరింత బాధపెట్టింది.

ఏమిటి... ఎందుకు వెళ్ళావని నిలదీయడేం....

ఆర్ద్రతను నింపుకున్న అతడి చూపుల ముందు పరాజితురాలైనట్టుగా తల వంచుకుంది.

"నాన్నగారి కారులో వచ్చాను" నేలచూపులు చూస్తూనే అంది.

"నిన్ను అనవసరంగా గాభరా పెట్టినట్టవుతుందని తెలియపరచలేదు." నెమ్మదిగా పైకిలేచి అంచుకు జారబడి కూర్చున్నాడు.

"ఏమైందసలు" గిల్టీగానే అడిగింది

"అతిగా పని చేస్తున్నందున శరీరంలోని అవయవాలు కూడా ఎదురుతిరిగాయి." అతని మాటల్లోని నిగూఢత ఆమెను మరింత కుంచింప చేసింది.

"వట్టి జ్వరం మాత్రమే ..." నిట్టూర్చాడు...

సునీత మాటలు జ్ఞప్తికొచ్చాయి.

ఏదేదో చెప్పాలనుంది ....

తను పూర్తిగా మారానని పశ్చాత్తాపంతో అతడి ఒడిలో వాలిపోవాలను కుంది.... కాని అంతరాళంలో ఏదో బిడియం..... ఎలా చెప్పాలి అన్న సంశయం.

"హల్లో శిల్పా...."

జయశ్రీ కంఠం వినిపించటంతో చివాలును తలతిప్పింది.

చేతిలో జూస్ గ్లాస్‌తో వంట గదిలో నుండి వస్తోంది.

"అయితే మీ వూరిలో ఫంక్షను పూర్తయి పోయిందన్నమాట."

గ్లాసును కిరీటికి అందిస్తూ కాట్‌పై కిరీటి చేరువగా కూర్చుంది.

ఆమె మాటల్ని బట్టి కిరీటి అందర్నీ మభ్యపెట్టాడని గ్రహించింది. కాని జయశ్రీ అతడికంత చేరువగా కూర్చోవటం శిల్ప క్షమించలేకపోయింది.

"మీఆయనకి సేవలు చేయలేక ఈ వారంరోజులు నేను నిద్ర పోలేదంటే నమ్ము... ఇక మీవారికి నా అవసరం తీరిపోయినట్టే..."

ఆమె క్రీగంట చూపులు, తను కిరీటికి చాలా సన్నిహితురాలైనట్టుగా ఆమె ప్రవర్తించే తీరు, కిరీటి మౌనం శిల్పలో అనుమానాన్ని ఉద్భృతం చేసింది.

ఎంత బరి తెగించారు.....

వారం రోజులుగా రాత్రీ పగలు మొగుడ్ని వదిలి ఈవిడగారు ఇక్కడే తిష్ట వేసిందన్నమాట......

చెప్పుకోవటానికి కూడ సిగ్గులేనట్టు ఎంత పచ్చిగా మాట్లాడుతుంది.

ఆవిడగారు అలా మాట్లాడు తుంటే యీయనగారి సంస్కారం ఏమైంది....?

అడ్డు తొలగిపోయిందని ఆనందంగా రోజులు గడిపేస్తున్నారన్నమాట.

శిల్పలో అంత వరకూ ఉన్న సహనం చచ్చిపోయింది.

ఊరినుండి వస్తూ చెప్పాలనుకున్న మాటలు మరచిపోయింది. సునీత ప్రభోధనలన్నీ ఆమె ఆవేశం క్రింద సమాధి అయిపోయాయి.

కోపంతో తన గదిలోకి వెళ్ళి పోయింది.

సూట్‌కేస్ ఓ మూల పరుపుపై వాలిపోయింది.

ఆమెకు ఇంటి దగ్గర సంఘటన, ఇక్కడ వ్యవహారం గుర్తుకొస్తుంటే మొత్తం పురుషజాతి అంటేనే అసహ్యం వేసింది.

జయశ్రీ మాటలు, అనవసరమైన నవ్వులు మెల్లగా వినబడుతుంటే తను పరాయి యింటిలో వున్నట్టుగా వుంది.

కిరీటి గదికి వచ్చుంటే విరుచుకు పడాలనుంది.

అతడు రాకపోవటమూ ఆమెకో అవమానంగా అని పించింది.

"ఆంటీ " ఓ పసిపిల్లాడి కంఠం వినిపించగానే ఎవరన్నట్టుగా ప్రక్కకు చూసింది.

పాలుగారుతున్నట్టుగా పసిమి ఛాయలో వున్న పదేళ్ళ బాబు.

"నువ్వేనా మా శిల్పా ఆంటీ"

ప్రక్కనే కూర్చుని చనువుగా అడుగుతుంటే తనను తాను మరచిపోయింది కొన్ని క్షణాలు పాటు.

"నేనే బాబూ..... మరి నీ పేరేంటి" లాలనగా అడిగింది.

"నా పేరేమో నళినీ... నన్ను కిరీటి అంకుల్ నానీ అని పిలుస్తుంటారు. ఇన్నాళ్ళూ నువ్వెందుకు రాలేదు ఆంటీ..... నేను రోజూ అంకుల్‌ని అడుగుతున్నా... నువ్వెప్పుడొస్తావని..."

శిల్పకు యీ సంఘటన విచిత్రంగా వుంది. తనకు అసలు తెలీని యీ బాబు ఎవరు? ఇన్నాళ్ళూ ఎక్కడున్నాడు? యీ బాబు తలి దండ్రులెవరు ? ఎన్నో రోజులుగా తనను కిరీటిని అడుగుతున్నాడంటాడేమిటి? కిరీటికి బంధువులెవరూ లేనప్పుడు ఈ బాబు అంకుల్ అంటూ ఎక్కడినుండి ఊడి పడ్డాడు.

ఒకవేళ యీ బాబు....

అంతరంగంలో కలుక్కుమనిపించిన సన్నని అనుమానపు పొర.

"అయితే బాబూ.... నేనూ నిన్ను నానీ అని పిలి చేదా?"

"ఓ... అలాగే " కళ్ళను చక్రాల్లా తిప్పాడు.

"మరి ఇన్నాళ్ళూ ఇక్కడకెందుకు రాలేదు... మమ్మీ దగ్గరున్నావా" గొంతు స్థాయిని తగ్గించి నెమ్మదిగా అడిగింది.

"మమ్మీ రావటానికి చాలా రోజులు పడుతుందిగా. అందుకని అంకుల్ నన్ను బాంబేలో బోర్డింగ్ స్కూల్లో చేర్పించారు."

అమాయకంగా చెప్పిన బాబు మాటలు ఆమెలోని అనుమానాన్ని మరింత బలపరిచాయి.

"మరి ఇప్పుడెందుకు వచ్చినట్టు?"

"నన్నిక్కడే కాన్వెంట్‌లో చేర్పిస్తానని తీసుకొచ్చేశారు. మరి నాకు అక్కడ అంకుల్ కనిపించకపోతే ఏడుపొస్తుందిగా?"

ఆమెలో సంఘర్షణ మొదలైంది.

బాబు తప్పకుండా కిరీటి కొడుకే అయ్యుంటాడు.

బాబును బోర్డింగ్ స్కూల్లో చేర్చి కన్యతో మరెక్కడో కాపురం చేస్తున్నాడు.

అందుకే అతనిలో నిర్లిప్తత....

ఆమెకు అన్యాయం చేస్తున్నానన్న బాధతోనే అర్ధరాత్రి వరకూ ఫొటో ఆల్బమ్‌ను చూస్తూ బాధపడటాలూ, తనను తప్పించుకొని తిరగడాలూ

బాబు అదే పనిగా మాట్లాడుతున్నా ఆమె ఏ ఒక్క మాటా స్పష్టంగా వినటంలేదు.

ఇంత కథ ఉన్నప్పుడు కావాలని తననెందుకు కట్టుకున్నట్టు.

ధైర్యంగా ఆమెనే తెచ్చుకొని కాపురం చెయచ్చుగా?

ఆమె కావాలి .... తనూ కావాలి ....

ఏమిటిది?

అంతా ఓ విషమంలా అనిపించింది.

ఆమె వుండగా తనను పెళ్ళి చేసుకోవటంలో అంతర్యము తప్పకుండా తనపై పగ తీర్చుకోవాలన్న ప్రయత్నమే.

అయితే ఈ పగకు మొదలెక్కడ?

ఆమెకు కిరీటిని కలిశాక తండ్రి తిరిగి వచ్చి తన వివాహ విషయం మాట్లాడటం లగాయితుగా జరిగిన సంఘటనలు ఒక్కొక్కటీ గుర్తుకు రాసాగాయి.

తనకు పెళ్ళి చేసుకోవటంలో తప్పకుండా ఏదో ఓ పథకం వుందన్న నిర్ధారణకు వచ్చింది.

కోపంతో, కసితో బాబుని దూరంగా నెట్టేయాలనిపించినా బలవంతంగా నిగ్రహించుకుంది. ఆ పసికందుపై పగ తీర్చుకోవటం మూర్ఖత్వం అనిపించింది.

"రా ఆంటీ! ఆకలేస్తుంది" కలుపుగోలుగా అడుగుతున్న నానీ అభ్యర్థన కాదనలేక పోయింది.

డైనింగ్ టేబుల్ దగ్గర కిరీటి లేడు.

నానీకి అన్నం వడ్డిస్తూ "మరి అంకుల్‌ని పిలవ్వా" అంది.

"అంకుల్ అన్నం తినకూడదుగా?"

అప్పటికే అంతా ఆరా తీసినట్టుగా టక్కున జవాబు చెప్పటంతో శిల్ప ఇంకేం మాట్లాడలేదు.

అతి తక్కువ కాలంలో తనకెంతో చేరికై పోయిన నానీకి గోరుముద్దలు తినిపిస్తూ తనూ భోంచేసింది.

మరో రెండు రోజులలో కిరీటి పూర్తిగా కోలుకున్నాడు.

అనారోగ్యంగా వున్న కిరీటికి సపర్యలు చేయాలని మనసులో వున్నా మధ్య మధ్య వస్తున్న జయశ్రీ నీడను కూడా తను హర్షించలేనట్టుగా దూరంగానే వుండిపోయింది.

పైగా బాబు ఎవరైందీ పిలిచి చెబుతాడని, తనంటూ ఒకతి నున్నానని గుర్తించి అంతా వివరిస్తాడని ఎదురుచూసి ఫలితం కనిపించక పోయేసరికి మరింత చిన్నబుచ్చుకుని గది బయటకు రావటం మానేసింది.

మూడవరోజు ఆఫీసుకు వెళ్తూ "నానీ" అంటూ కిరీటి కేక వెయటంతో తన ఒడిలోనుంచి ముందుకు దూకిన నానీని చూస్తూనే ద్వారం దగ్గర నిలుచుంది.

నానీకి ముద్దుపెట్టి "టాటా" అంటూ చేయి ఊపుతూ కిరీటి కారులో కూర్చుంటే అసంకల్పితంగా చేయి లేపబోయి అంతలోనే గుర్తు వచ్చినట్టుగా ఆగిపోయింది.

అన్యోన్య మైన దాంపత్యం --- నవ్వుల్ని రువ్వే పసిపిల్లలు పారాడే ఇల్లు-- ఇవేగా ఆడది కోరుకునే వరాలు అన్న ఆలోచన లీలగా ఆమెను స్పృశించి మాయమైంది.

ఆ రాత్రి భోజనాలవేళ కిరీటితో కలిసి డిన్నర్ తీసుకోకూడదని శిల్ప తీసుకున్న నిర్ణయం నానీ బలవంతంతో వీగిపోయింది.